



ముంచంగిపుట్టులో కల్వర్టు కింద డాగ్, బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు చేపడుతున్న దృశ్యం

మిరియాల నర్సరీల అభివృద్ధికి ఇదే అదును

ప్రధాన మొక్కల నుంచి రన్నర్స్‌ను సేకరించుకోవాలి

- రైతులకు నూతన రకాలు పంపిణీ
- శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్

చింతపల్లి, మార్చి 28:

మిరియాల నర్సరీల అభివృద్ధికి ఇదే అదునని ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జిల్లాలో ఆదివాసీ రైతులు కాఫీతోటల్లో అంతర పంటగా మిరియాల సాగు చేపడుతున్నారు. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 98 ఎకరాల్లో రైతులు మిరియాల పంటను సాగు చేస్తున్నారు. ఆదివాసీ రైతులను మిరియాల పంట ఆర్థికంగా ఆదుకుంటోంది. దీంతో ఐటీడీఏ, ఉద్యానశాఖ అధికారులు మిరియాల సాగును విస్తరింపజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏజెన్సీలో ప్రధాన అంతర పంట అయిన మిరియాల సాగులో నర్సరీల అభివృద్ధికి ఏప్రిల్‌లో పలు రకాల యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త తెలిపారు.



పరిశోధన స్థానంలో పెంపొందిస్తున్న నర్సరీ బ్యాగులు

నర్సరీ బ్యాగులు సిద్ధం చేసుకోవాలి

మిరియాల నాట్లు వేసుకోవాలని ఆశించిన రైతులు తొలుత నర్సరీ బ్యాగులను సిద్ధం చేసుకోవాలి. బ్యాగుల్లో నింపుకునేందుకు అవసరమైన మట్టి మిశ్రమాన్ని ఎర్ర మట్టి(మెత్తనిమట్టి), పశువులగెత్తం, ఇసుక 1:1:1 నిష్పత్తిలో(మూడూ సమపాళ్లలో) కలుపుకుని సిద్ధంచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని నర్సరీ బ్యాగుల్లో నింపుకోవాలి.

రన్నర్స్ సేకరణ

మిరియా నర్సరీలను పెంపొందించుకునేందుకు ప్రధాన మొక్క నుంచి రన్నర్స్‌ను తీసుకోవాలి. మొక్క అడుగు భాగంలో భూమికి సమాంతరంగా వ్యాప్తిచెందిన రన్నర్స్‌ను తీసుకోవాలి. ఈ రన్నర్ ఇరువైపులా 10 సెంటీ మీటర్లు కత్తిరించి తొలగించుకోవాలి. రన్నర్‌ను రెండు కణుపులుండే విధంగా చిన్నకొమ్మలుగా కత్తిరించుకోవాలి. ఒక కణుపు నర్సరీ బ్యాగు లోపల వుండే విధంగా బ్యాగుల్లో నాటుకోవాలి. ఈ నర్సరీ బ్యాగుల్లో మొక్కల్లో 80 శాతం తేమ వుండే విధంగా నీటి తడులు పెట్టుకోవాలి. గాలి, వెలుతురు తగిలే విధంగా ఈ నర్సరీ బ్యాగులను నీడలో పెట్టుకోవాలి. 90 రోజుల తరువాత జూలై- ఆగస్టు మాసాల్లో నాట్లు వేసుకోవాలి.

రెండు మొక్కలు చొప్పున నాట్లు

మిరియాల మొక్కలు నాట్లు వేసుకునేందుకు ముందుగా పెంచుకున్న నీడనిచ్చే మొక్కలకు రెండువైపులా రెండు మొక్కలను నాటుకోవాలి. మొక్కలు నాటుకునేందుకు 45 సెంటీమీటర్లు లోతు, వెడల్పు, పొడవు కలిగిన గోతులు తవ్వుకోవాలి. పశువుల గెత్తం, ఎర్రమట్టి సమపాళ్లలో కలుపుకుని ఈ గోతుల్లో నింపుకోవాలి. జూలై- ఆగస్టు మాసాల్లో ఈ గోతుల్లో మిరియాల మొక్కలను నాటుకునేందుకు సిద్ధం చేసుకోవాలి.

పన్నీయూర్-1 అనుకూలం

గిరిజన ప్రాంతానికి పన్నీయూర్-1 రకం అనుకూలమని ఉద్యాన శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా నిరూపించారు. ఎకరాకు 500 కిలోలు పైబడి దిగుబడి వస్తుంది. ఒక గుత్తిలో సుమారు 125 గింజలుంటాయి.

మిరియాల తోటల సస్యరక్షణ

కాపునిస్తున్న మిరియాల తోటల్లోనూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ప్రధానంగా మిరియాల మొక్కల చుట్టూ ... మిగతా 6వ పేజీలో

ఎనిమిది కొత్త రకాల నర్సరీల పెంపకం



స్పైస్‌బోర్డు శాస్త్రవేత్తల సహకారంతో రైతులకు నూతన రకాలను పరిచయం చేయాలనే ఎనిమిది కొత్తరకాల మిరియాల మొక్కల నర్సరీలను పెంపొందిస్తున్నాం. గిరిజన ప్రాంతానికి అనువైన, అధిక దిగుబడినిచ్చే శ్రీకర, సుభకర, పంచమీ, పౌర్ణమి, మలబార్ ఎక్స్‌ఎల్, గిరిముండా, శక్తి, తేవం రకాలను కేరళ నుంచి దిగుమతి చేసుకుని హెచ్‌ఎస్‌టీసీలో పెంపొందిస్తున్నాం. ఈ మొక్కలను ఐటీడీఏ ద్వారా రైతులకు పంపిణీ చేస్తాం. పరిశోధన స్థానంలో ప్రస్తుతం పరిశోధన స్థానంలో అభివృద్ధి చేస్తున్న పన్నీయూర్-1, కరిముండ, శక్తి, తేవం రకం మొక్కలను రైతులకు జూలైలో ఒక మొక్క రూ.15 ధరకు విక్రయిస్తాం.

- డాక్టర్ శివకుమార్, శాస్త్రవేత్త,
అధిపతి, ఉద్యాన పరిశోధన స్థానం, చింతపల్లి

మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలి

- కలెక్టర్లు, ఎస్పీలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సమాజానికి హానికారిగా వున్న మత్తుపదార్థాల రవాణాను అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలని, ఇందులో భాగంగా మత్తు పదార్థాల రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలన్నారు. అందుకు అవసరమైన చర్యలను పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పటిష్ఠంగా చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల రవాణా జరగకూడదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా, ఎస్ఈబీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.13
సహరి (శని)	4.40

విస్తృత తనిఖీలు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం

- డాగ్, బాంబ్ స్క్వాడ్‌ల ముమ్మర గాలింపు

ముంచంగిపుట్టు, మార్చి 28: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆంధ్రా, ఒడిశా పోలీసులు అప్రమత్తమయ్యారు. మండల పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఉండడంతో స్థానిక నాలుగు రోడ్ల కూడలితో పాటు పలు ప్రధాన జంక్షన్ల వద్ద సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసు బలగాలు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో గురువారం ఆంధ్రాకు చెందిన డాగ్, బాంబ్ స్క్వాడ్‌లు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా విస్తృత తనిఖీలు చేపట్టారు. కల్వర్టులు, కాజ్‌వేలు, వంతెనల కింద క్షుణ్ణంగా మెటల్ డిటెక్టర్లతో పరిశీలించారు. మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రజా ప్రతినిధులు పోలీసులకు విధిగా సమాచారం అందించాలని ఇప్పటికే వారికి పోలీసులు సూచించారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

- ఖాళీ బిందెలతో గ్రామస్థుల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి మార్చి 28: మండలంలోని జడ్డంగి చైతన్యనగర్‌లో తాగునీటి సమస్యపై గ్రామస్థులు గురువారం ఆందోళన చేశారు. ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గిరిజన నాయకుడు తెడ్ల రాంబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెడ్ల రాంబాబు మాట్లాడుతూ చైతన్యనగర్‌లో విద్యుత్ సరఫరా కోసం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, వాటిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక లోవోల్టేజ్‌తో ఒక చేతి బోర్‌తోనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత 10 రోజుల నుంచి అధికారులకు చెబుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే విద్యుత్ సమస్య పరిష్కరించి తాగునీటి సమస్యను తీర్చాలని, లేనిపక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామస్థులు గూడెం లక్ష్మి, బచ్చల బేబి, గుర్రే మధుర వాణి, డబ్బా కోట దుర్గాదేవి, వీరకోట నారాయణమ్మ, ఒంటిపల్లి మంగ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

జి.మాడుగుల, మార్చి 28: మండలంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు బుధవారం అడ్డుకున్నారు. దీనికి సంబంధించి అధికారులు గురువారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గెమ్మెలి పంచాయతీ కేంద్రానికి చెందిన బాలిక(17) ఓ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆ బాలికకు, జి.మాడుగుల పంచాయతీ సాడేకు గ్రామానికి చెందిన పరమేశ్వరరావు అనే యువకుడికి పెద్దలు ఈ నెల 27న పెళ్లి నిశ్చయించారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్, పోలీస్, రెవెన్యూ అధికారులు సాడేకు గ్రామానికి వెళ్లి పెళ్లిని అడ్డుకున్నారు. బాల్య వివాహాలు నేరమని ఈ సందర్భంగా సీడీపీవో సురవరమ్మ వారికి నచ్చజెప్పారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

అరకులో బలంగా టీడీపీ

దొన్నుదొర విజయం ఖాయం

- ఈ సీటును బీజేపీకి కేటాయించడంపై పునరాలోచన చేయాలి
- టీడీపీ ఆరు మండలాల అధ్యక్షుల వెల్లడి

అరకులోయ, మార్చి 28: అరకు నియోజకవర్గంలో టీడీపీ బలంగా ఉందని, పార్టీ అభ్యర్థి దొన్నుదొర విజయం ఖాయమని నియోజకవర్గంలోని ఆ పార్టీకి చెందిన ఆరు మండలాల అధ్యక్షులు తెలిపారు. గురువారం వారు దొన్నుదొర నివాసంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ అధిష్ఠానం బుధవారం రాత్రి అరకులోయ అభ్యర్థిగా పాంగి రాజారావును ప్రకటించిన నేపథ్యంలో వీరంతా సమావేశమై తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సమావేశంలో ముందుగా ముంచంగిపుట్టు, అనంతగిరి, హుకుంపేట మండలాల పార్టీ అధ్యక్షులు బలరాం, బుజ్జిబాబు, తులసీరావు విలేకరులతో మాట్లాడుతూ అరకులోయలో జరిగిన బహిరంగ సభలో పార్టీ అభ్యర్థిగా దొన్నుదొరను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించారన్నారు. దీంతో దొన్నుదొర, పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశారని, ఓటర్లు పూర్తి మద్దతు తెలిపారన్నారు. అయితే బుధవారం రాత్రి బీజేపీ అభ్యర్థిగా పాంగి రాజారావును ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించడం బాధ కలిగించిందన్నారు. దీనిపై ఆ పార్టీ పునరాలోచన చేయాలన్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యం

పొత్తుల్లో భాగంగా అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా తానే ఉన్నానని, మార్పుపై టీడీపీ అధిష్ఠానం నుంచి ఎటువంటి సమాచారం రాలేదని దొన్నుదొర తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భయందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఒకవేళ బీజేపీ అభ్యర్థిగా పాంగి రాజారావును కొనసాగిస్తే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ నిర్ణయం తీసుకుంటే దాని మేరకు నడుచుకుంటానని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఆరు మండలాల సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షులు, నాయకులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న దొన్నుదొర

తాడి.. కాలుష్యంతో తల్లడిల్లి..

ఫార్మాసిటీ కాలుష్యంతో గ్రామస్థులు ఉక్కిరిబిక్కిరి



ఫార్మాసిటీకి ఆనుకుని ఉన్న తాడి బీసీ కాలనీ

- గ్రామాన్ని తరలించాలని 15 ఏళ్లుగా పోరాటం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- వైసీపీ అధికారంలోకి వచ్చాక మీనమేషాలు
- గ్రామాన్ని తరలిస్తామని రెండేళ్ల క్రితం సీఎం జగన్ హామీ
- ఇప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టని వైనం
- మండిపడుతున్న గ్రామస్థులు
- సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం

పరవాడ, మార్చి 28:

ఫార్మాసిటీ కాలుష్య కోరల్లో చిక్కుకుని తాడి గ్రామస్థులు విలవిల్లాడిపోతున్నారు. భరించలేని దుర్వాసన, తరచూ పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలతో భయం భయంగా గడుపుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాన్ని తరలించడానికి జీవో జారీ చేసి నిధులు కూడా కేటాయించింది. ఇంతలో ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో దీనికి బ్రేక్ పడింది. అయితే రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ గ్రామాన్ని తరలిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామస్థులు మండిపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలను సైతం బహిష్కరించడానికి సిద్ధమవుతున్నారు.

ఫార్మా కాలుష్యంతో తాడి పంచాయతీ పరిధిలోని పెద తాడి, చినతాడి, తాడి బీసీ కాలనీల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భూగర్భ జలాలు సైతం కలుషితం కావడంతో తాగునీటికి అల్లాడిపోతున్నారు. కొందరు గత్యంతరం లేక కొళాయి నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నారు. చాలా మంది మోకాళ్ల నొప్పులతో నడవలేని స్థితిలో మంచాన పడుతున్నారు. సురక్షిత తాగునీరు అందుబాటులో లేక లంకెలపాలెం, అగనంపూడి, పరవాడ తదితర ప్రాంతాల నుంచి మినరల్ వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి ఆటోల్లో తెచ్చుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ వాతావరణం చల్లగా ఉన్నప్పుడు, వర్షాలు కురిసే సమయంలో కాలుష్య ప్రభావం మరింత తీవ్రంగా ఉండడంతో తలుపులు మూసుకున్నా ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. స్థానికుల్లో ఎక్కువ శాతం మంది శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని చెబుతున్నారు. దీనికి తోడు ఫార్మా పరిశ్రమల్లో సంభవిస్తున్న ప్రమాదాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఏ సమయంలో ఎటువంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనని భయం భయంగా కాలం గడుపుతున్నారు. ఫార్మాసిటీలోని పరిశ్రమల కాలుష్యంతో నరకయాతన అనుభవిస్తున్నా ఫార్మాసిటీ యాజమాన్యం గాని, ప్రభుత్వ యంత్రాంగం గాని పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఫార్మాసిటీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు వెచ్చించే అవకాశమున్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఫార్మా కాలుష్యంతో కలుషితమైన బావినీరు

15 ఏళ్లుగా పోరాటం

గ్రామాన్ని తరలించాలని గత 15 ఏళ్లుగా ఈ ప్రాంతవాసులు ఆందోళనలు చేస్తున్నారు. తాడి గ్రామం తరలింపు కోసం అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి 2012లో నిరాహారదీక్ష చేపట్టారు. కాగా గత టీడీపీ ప్రభుత్వం తాడి పంచాయతీని ... మిగతా 6వ పేజీలో

ప్రతి అంశంపై క్షుణ్ణంగా శిక్షణ ఇవ్వాలి

కలెక్టర్ విజయసునీత సూచన

- ఎన్నికల శిక్షణ నిర్వహించే మాస్టర్ ట్రైనర్లతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత, పక్కన ఆర్‌వోలు భావన, అభిషేక్

పాడేరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే శిక్షణలో ప్రతి అంశంపై క్షుణ్ణంగా శిక్షణ అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సూచించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల శిక్షణ మాస్టర్ ట్రైనర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా మనకు అన్నీ తెలుసుననే భావనతో ఎవరూ ఉండకూడదన్నారు. ప్రతి చిన్న విషయాన్ని సైతం సీరియస్‌గానే తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే సూచనలు, సలహాలను గమనిస్తూ వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీంతో శిక్షణలో ఎప్పటికప్పుడు నవీకరణకు తోడ్పడతాయన్నారు. తాజా సమాచారాన్ని అందించడంలో అలసత్వం, జాప్యం చేయకూడదన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ భయాందోళనకు గురికావద్దని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల వినియోగంలో చిన్న పొరపాటు సైతం జరగకూడదని, ఈ క్రమంలో పొరపాట్లు జరిగే అవకాశాలు, వాటిని సరిదిద్దే అంశాలను ఎన్నికల సిబ్బందికి అర్థమయ్యే రీతిలో శిక్షణ అందించాలన్నారు. ప్రతి చిన్న విషయం సైతం అట్టడుగు స్థాయి సిబ్బందికి సైతం చేరేలా శిక్షణ నిర్వహించాలన్నారు. ఓటింగ్ పూర్తయిన తరువాత నాలుగు రకాల సీళ్లు వేయాలని, ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య ఈవీఎంలో చూపించిన సంఖ్య, పీవో డైరీలో వున్న సంఖ్య, ఓటింగ్ స్లిప్పులు, తదితర ఐదు విభాగాల్లోని నంబర్లు సైతం ఒకేలా ఉండాలన్నారు. ఈ క్రమంలోనే ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ విజయసునీత సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల రిటర్నింగ్ అధికారులు భావన వశిష్ట, అభిషేక్, ఏఎస్పీ కె.ధీరజ్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మాస్టర్ ట్రైనర్లు

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పాయకరావుపేట, మార్చి 28 : తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సీపట్నం-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య గురువారం గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో గురువారం మధ్యాహ్నం విశాఖ నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి '45 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి వంటిపై తెలుపు రంగు ఫుల్ షర్టు, ఫుల్ ప్యాంట్ ఉన్నాయని, మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో లేదా సెల్ నంబర్లు94948 87786, 94906 19020లో సంప్రదించాలని తెలిపారు.

పోలీసుల అదుపులో పోక్సో కేసు నిందితుడు

నర్సీపట్నం, మార్చి 28 : మండలంలోని దుగ్గాడలో బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడ్ని గురువారం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ భీమరాజు తెలిపిన వివరాలివి. దుగ్గాడ గ్రామానికి చెందిన పదిహేడేళ్ల బాలిక బుధవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నాతవరం మండలం గునిపూడికి చెందిన సాయి అత్యాచార యత్నానికి పాల్పడినట్టు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

విద్యార్థినిని వేధించిన యువకుడిపై కేసు

నర్సీపట్నం, మార్చి 28 : ఇంజనీరింగ్ విద్యార్థినిని వేధించిన యువకుడిపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. నర్సీపట్నం కాపు వీధికి చెందిన విద్యార్థిని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుంది. గురువారం నర్సీపట్నంలోని ఓ పూల దుకాణంలో పని చేస్తున్న అయ్యప్ప అనే యువకుడు వెంట పడి వేధించాడని విద్యార్థిని ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ కాంతి కుమార్ తెలిపారు.

146 ఒడిశా మద్యం బాటిళ్లు పట్టివేత

▸▸ ఇద్దరి అరెస్టు.. బొలేరో వాహనం సీజ్

పరవాడ, మార్చి 28: ఒడిశా రాష్ట్రానికి చెందిన 146 మద్యం బాటిళ్లను పట్టుకొని ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్టు చేసి నట్టు పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపారు. అలాగే మద్యాన్ని తరలించిన బొలేరో వాహనం సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు. సీఐ అందించిన వివరా లిలా ఉన్నాయి. పెందుర్తి ప్రాంతానికి చెందిన లాది సుశాంత్‌పాత్రో, విజయనగరం జిల్లా కొత్తవలస గ్రామానికి చెందిన లంక గౌరీశంకర్ కలిసి ఒడిశాలోని బరంపురం నుంచి మద్యం కొనుగోలు చేసి తానాం గ్రామంలో విక్రయిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సీఐ బాల సూర్యారావు తన సిబ్బందితో తానాం శివారులో గురువారం మాటువేశారు. ఆ సమయంలో వస్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా.. 146 ఒడిశా మద్యం బాటిళ్లు దొరికాయి. ఈ సందర్భంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న సుశాంత్‌పాత్రో, గౌరీ శంకర్‌లను అరెస్టు చేశారు. అలాగే మద్యం తరలించేందుకు ఉపయోగించిన బొలేరో వాహనాన్ని సీజ్ చేసినట్టు సీఐ వెల్లడించారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 28: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మపాల వద్ద మునగపాక మండలం రాజుపేటకు చెందిన భరణికాన ఆదినారాయణ నుంచి 12 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ గురువారం తెలిపారు. తుమ్మపాలలోని మద్యం దుకాణం నుంచి బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకువెళు తుండగా తుమ్మపాల -వెంకుపాలెం రోడ్డులోని షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద పట్టుకున్నామన్నారు.

హైవేపై కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



సంఘటనా స్థలంలో బోల్తాపడిన కారు

కొత్తూరు, మార్చి 28: మండలంలోని పిసినికాడ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారు రోడ్డు డివైడర్ ఢీకొని బోల్తా పడింది. కాకినాడలో ఒక వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దువ్వాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళకు ఎటువంటి గాయాలు తగలలేదు. ఈ విషయమై అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావును సంప్రదించగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

సారా స్థావరంపై పోలీసుల దాడి

▸▸ 80 లీటర్ల సారా స్వాధీనం

▸▸ వెయ్యి లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట రూరల్, మార్చి 28: మండలంలోని గుంటపల్లి గ్రామ శివారులో గురువారం సారా తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేసి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన గుత్తుర్తి సూర్యారావును అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పి. అప్పలరాజు తెలిపారు. అలాగే వెయ్యి లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం చేసినట్టు చెప్పారు. ముందుగా అందిన సమాచారం మేరకు తాను, ఎస్‌ఐ జోగారావు, పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశామన్నారు. గుంటపల్లి గ్రామానికి చెందిన గుత్తుర్తి సూర్యారావు, మరొక వ్యక్తి తమను చూసి పారిపోగా.. పోలీసులు వెంబడించి సూర్యారావును పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. గుత్తుర్తి సూర్యారావు, పరారీలో ఉన్న పెంకే వీరబాబులపై కేసు నమోదు చేశామని సీఐ అప్పలరాజు తెలిపారు.

అచ్చెన్నాయుడు, సీఎం రమేశ్‌లకు స్వాగతం



అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అంజేస్తున్న విష్ణుకుమార్‌రాజు, చిత్రంలో సీఎం రమేశ్, తదితరులు ఉన్నారు

గోపాలపట్నం, మార్చి 28: నగరానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లకు విమానాశ్రయంలో నాయకులు స్వాగతం పలికారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న వారికి బీజేపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, ఆ పార్టీ ప్రోటోకాల్ కన్వీనర్ బాలరాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, నాయకులు నాగేంద్ర, దామోదర్, రామ్‌కుమార్, తదితరులు స్వాగతించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఊరికి దూరంగా పట్టా... నిర్మాణాలు ఎట్టా..?

▸▸ వజ్రగడలో జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారుల ఆవేదన ▸▸ రెండేళ్లు గడుస్తున్నా ఒక్క పునాదీ పడని వైనం

మాకవరపాలెం, మార్చి 28: మండలంలోని వజ్రగడ గ్రామం లో రెండేళ్ల కిందట గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో కొండ ప్రాంతంలో జగనన్న కాలనీకి స్థలం కేటాయించడంతో ఇప్పటి వరకు ఒక్క పునాదులు కూడా వేయలేదు. సుమారు 50 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేసి వారికి జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అయితే గ్రామానికి దూరంగా ఉండడం, కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఆ స్థలంలో తుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు కొండ ప్రాంతంలో స్థలాలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారని లబ్ధిదా రులు వాపోతున్నారు. ఈ స్థలాల వద్దకు వెళ్లడానికి సరైన రహదారి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వజ్రగడ గ్రామంలో జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇచ్చిన స్థలం

డిజిటల్ అసిస్టెంట్ స్థానంలో గ్రామ వలంటీర్

▸▸ పి.కె.గూడెం సచివాలయంలో విధులు

▸▸ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకోని అధికారులు

▸▸ అభ్యంతరం తెలుపుతున్న గ్రామస్థులు

నాతవరం, మార్చి 28: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంటుండగా, మండలంలోని పి.కె.గూడెం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ స్థానంలో గ్రామ వలంటీర్ గొంప సతీష్ విధులు నిర్వహించడంపై ఆ గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ళ నుంచి ఈ గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇప్పటివరకు వలంటీర్ సతీష్ ఆ విధులు నిర్వహించినా తాము పట్టించుకోలేదన్నారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలోనూ డిజిటల్ అసిస్టెంట్ స్థానంలో విధులు నిర్వహిస్తుండడం తగదని, దీనిపై నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తామని గ్రామానికి చెందిన గాడి పెంటయ్యనాయుడు గురువారం తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, తాను ఇక్కడకు రాకముందు నుంచి డిజిటల్ అసిస్టెంట్‌స్థానంలో వలంటీర్ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సచివాలయంలో విధులు నిర్వహించవద్దని వలంటీర్‌కు చెప్పానన్నారు.



డిజిటల్ అసిస్టెంట్ స్థానంలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ సతీష్

జగన్ పాలనలో మత్స్యకారులకు అన్యాయం

▸▸ ఓటుతో సర్కారును సాగనంపుదాం

▸▸ పూరీలో వలస మత్స్యకారుల సమావేశంలో టీడీపీ పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత



పూరీలో పేట మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న అనిత

నక్కపల్లి, మార్చి 28: జగన్ రెడ్డి పాలనలో మత్స్యకారులకు ఐదేళ్లుగా తీరని అన్యాయం జరిగిందని టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. పూరీ, కోణార్క్‌ల్లో వుంటున్న నియోజకవర్గ మత్స్యకార వలస ఓటర్లను కలిసేందుకు ఆమె పూరీ వెళ్లారు. గురువారం ఉదయం పూరీలో ఇంటింటా ప్రచారం చేసి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. అనంతరం అక్కడున్న మత్స్యకార నాయకులు, గంగపుత్రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, జెట్టీ నిర్మాణాలు కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఇటువంటి రాక్షస పాలనను అంతమొందించేందుకు ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. సామాన్యుడి చేతిలో శక్తి వంతమైన ఓటుతో జగన్ సర్కారును అందరం కలిసికట్టుగా సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మత్స్యకారులు టీడీపీ ఆవిర్భావం నుంచి అండదండగా వుంటున్నారని, నియోజకవర్గంలో మత్స్యకారుల సంక్షేమానికి తాను చిత్తశుద్ధితో పనిచేస్తానని హామీ ఇచ్చారు. పాయకరావుపేట నుంచి పూరీ వచ్చానని, మీ ఇంటి ఆడబిడ్డగా తనను ఆశీర్వదించాలని అనిత కోరారు. ఈ సందర్భంగా పూరీలో వున్న పేట వలస మత్స్యకారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం పలువురు మత్స్యకార నాయకులతో అనిత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కూడా సమావేశమయ్యారు.



పూరీలో మత్స్యకార సంఘ నాయకులలో మాట్లాడుతున్న అనిత

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు

▸▸ మరో పది రోజుల పాటు తీర్థం

▸▸ రికార్డు స్థాయిలో తరలివస్తున్న భక్తులు



ఉభయ దేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుడు

నక్కపల్లి, మార్చి 28 : జిల్లాలో ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాకలో శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు గురువారం రాత్రి పుష్పయాగోత్సవాలతో ఘనంగా ముగిశాయి. ఈనెల 19 నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, ధ్వజారోహణ, ఎదురు సన్నాహోత్సవం, రథోత్సవాలు, కల్యాణోత్సవం, తోట ఉత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి సహా అనేక తిరువీధి సేవలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈనెల 20న కల్యాణోత్సవం సందర్భంగా స్వర్ణాలంకరణలో స్వామివారు భక్తులకు అపురూప దర్శనమిచ్చారు. రికార్డు స్థాయిలో పలు ప్రాంతాల నుంచి భక్తులు ఉపమాక ఆలయానికి వస్తున్నారు. గురువారం రాత్రి పుష్పయాగోత్సవం మూడో రోజు స్వామివారికి ఆలయ అర్చకుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. భక్తుల తాకిడికి తగ్గట్టు టీటీడీ ఏర్పాట్లు చేయలేదనే విమర్శలు మాత్రం వినిపించాయి. స్వామివారి కల్యాణోత్సవాలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు సీఐలు విజయ్‌కుమార్,అప్పన్న పటిష్ఠ చర్యలు చేపట్టారు. కాగా ఉపమాక వెంకన్న జాతరలో భాగంగా తీర్థం మరో 10 రోజులు జరగనుంది.



కాంతులీనుతున్న ఉపమాక క్షేత్రం

ఐపీఎల్ టికెట్లపై లోపించిన పారదర్శకత

▸▸ చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్లు బ్లాక్ చేశారనే ఆరోపణలు

▸▸ ఆన్‌లైన్‌లో ఎన్ని టికెట్లు అమ్మకానికి ఉంచారో వెల్లడించని నిర్వాహకులు

▸▸ మరోవైపు టికెట్లు, కాంప్లిమెంటరీ పాస్‌ల కోసం ▸▸ ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖుల ఒత్తిడి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 28:

చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఈనెల 31న నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో పారదర్శకత లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారం ఉదయం పది గంటలకు ఆన్‌లైన్‌లో పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా టికెట్ల అమ్మకం ప్రారంభించారు. కేవలం పావుగంటలోనే రూ.1,000, రూ.1,500 విలువ గల టికెట్లు, మరో గంటన్నరకు రూ.3,000, రూ.4,000 టికెట్లు సోల్డ్ అవుట్ అని ప్రకటించడం విస్మయానికి గురిచేసింది. రూ.2,000, రూ.3,500 ధర గల టికెట్ల విషయంలో స్పష్టత లేదు. మ్యాచ్‌కు తీవ్ర డిమాండ్ రావడంతో టికెట్లను బ్లాక్ చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్ని టికెట్లు అమ్మకానికి పెట్టారు?

స్టేడియం సీటింగ్ సామర్థ్యం 25 వేలు. చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌కు బుధవారం ఆన్‌లైన్‌లో ఎన్ని టికెట్లు అందుబాటులో పెట్టారనే వివరాలు నిర్వాహకులు వెల్లడించలేదు.

బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో సోల్డ్ అవుట్‌గా ప్రకటించిన వాటిలో రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 ధర టికెట్ల వివరాలున్నాయే తప్ప...రూ.2,000, రూ.3,500 టికెట్ల ప్రస్తావన లేదు. దీంతో ఆ ధరల టికెట్లు ఏమయ్యాయని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నామమాత్రపు పాత్రగా ఏసీఏ

ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నామమాత్రపు పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యానికి అవసరమైన సదుపాయాలను ఏర్పాటుచేయడమే తమ బాధ్యతని, టికెట్ల అమ్మకాలలో తమ ప్రమేయం ఏమీ లేదని ఏసీఏ చెబుతోంది. కాగా క్లబ్ క్రికెటర్లు, అంపైర్లతోపాటు ఏసీఏ, వీడీసీఏ కార్యకలాపాలలో పాలుపంచుకునే వారికి కూడా ఐపీఎల్ మ్యాచ్‌లకు టికెట్లు/కాంప్లిమెంటరీలు ఇవ్వలేమని మెయిల్, ఇతర సమాచార వ్యవస్థల ద్వారా ఏసీఏ ఇప్పటికే స్పష్టం చేసిందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి ప్రధాన నిర్వాహకులైన ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ఇప్పటివరకూ అధికారంగా ఎటువంటి ప్రకటనలు చేయకపోవడం గమనించదగ్గ విషయం.

ధోనీ ఆడనుండడంతో చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌కు మంచి క్రేజ్ వచ్చింది. దీంతో టికెట్ల కోసం ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖుల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో తక్కువ సంఖ్యలో టికెట్లను అమ్మకానికి పెట్టి, మిగిలిన వాటిని బ్లాక్ చేశారని వినికిడి. దీంతో సగటు సామాన్య క్రీడాభిమానికి టికెట్ లభించే పరిస్థితి లేకుండా పోయింది.

లోక్‌సభ అభ్యర్థి సీఎం రమేశ్ సభకు తరలిరండి

▸▸ జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధ, చిత్రంలో పరమేశ్వరరావు, పంచకర్ల రమేష్‌బాబు

అనకాపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జేఎంజీ స్కూల్ ఎదురుగా మైదానంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగనున్న బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి అశేషంగా జనం తరలిరావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన జిల్లా టీడీపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు తరలివచ్చి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు సభను జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తొలిసారిగా అనకాపల్లి వస్తున్నందున ఘన స్వాగతం పలకాలన్నారు. అనకాపల్లి చేరుకొని నూకాంబిక, గౌరీపరమేశ్వరి అమ్మవార్లను దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకొన్న తర్వాత జేఎన్‌జీ స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకుంటారని తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ సభకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వెలుగు సీసీపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు

▸▸ వైసీపీ వర్గీయులతో కలిసి మా ఇంటిపై రాళ్లదాడి

▸▸ ఎర్రవరం టీడీపీ నాయకుడు ఆరోపణ

▸▸ కుటుంబానికి రక్షణ కల్పించాలని వేడుకోలు

గొలుగొండ, మార్చి 28 : ఇక్కడి వెలుగు ప్రాజెక్టు పరిధిలోని చోద్యం క్లస్టర్‌లో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ (సీసీ)గా పనిచేస్తున్న సర్వసిద్ధి శ్రీరామ్మూర్తిపై చర్యలు చేపట్టాలని డివిజనల్ ఎన్ని కల అధికారి, నర్సీపట్న ఆర్డీవో జయరాంకు టీడీపీ నాయకుడు అమరపల్లి నాగేశ్వరరావు గురువారం ఫిర్యాదు చేశారు. మండలం లోని ఎర్రవరం పంచాయతీకి చెందిన సీసీ శ్రీరామ్మూర్తితో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎర్రవరంలోని తమ ఇంటిపై బుధవారం రాళ్లతో దాడిచేశారని ఆరోపించారు. వీరి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాల్సిందిగా ఆయన కోరారు. వైసీపీకి చెందిన కొంతమందిని వెలుగు సీసీ గ్రామంలో వెనకేసుకుని వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు పాల్గొన్నారు.

తాడిని తరలించకుంటే ఎన్నికల బహిష్కరణ

▸▸ ఆర్డీవో కార్యాలయ డీటీకి గ్రామస్థుల వినతి



ఆర్డీవో కార్యాలయ డీటీకి వినతిపత్రం ఇస్తున్న తాడి గ్రామస్థులు

అనకాపల్లి టౌన్, మార్చి 28 : కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించకపోతే సాధారణ ఎన్నికలను బహిష్కరిస్తామని ఆ గ్రామానికి చెందిన పెద్దలు గురువారం ఆర్డీవో కార్యాలయ డీటీ జయశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. పరవాడ మండలం తాడిలో కాలుష్యం పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అందువలన గ్రామాన్ని తరలించాలని కోరారు. గ్రామానికి ఆనుకుని గ్రీన్‌బెల్ట్ నిబంధనలు ఉల్లంఘించి పైపులైన్ పనులు చేస్తున్నారని, వెంటనే ఆ పనులను నిలుపుదల చేయించాలని, గ్రామాన్ని తరలించే వరకు ఎన్నికల బహిష్కరణ చేయాలని నిర్ణయించామని గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బి.అప్పారావు, రామరాజు, నూకరాజు తదితరులు వివరించారు. ఈ విషయాన్ని గ్రామప్రజలంతా ఏకగ్రీవంగా తీర్మానించి మీ దృష్టికి తీసుకురావడమైందని వివరించారు. సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు

కోనాం సంతలో చింతపండుకు భలే గిరాకీ

▸▸ కిలో రూ.55 నుంచి రూ.60 చెల్లించి వ్యాపారులు కొనుగోలు



సంతకు విక్రయానికి తెచ్చిన చింతపండు

చీడికాడ, మార్చి 28 : మండలంలోని కోనాం సం తలో చింతపండుకు గురువారం మంచి గిరాకీ ఏర్ప డింది. బొట్టలు పెద్దవిగా ఉండడంతో వ్యాపారులు పోటీపడి కిలోకు రూ.అరవై వరకు చెల్లించి కొనుగోలు చేశారు. కోనాం పంచాయ తీతో పాటు పాడేరు, మాడుగుల, హుకుంపేట, అనంతగిరి మండలాలకు చెందిన గిరిజన గ్రామాల నుంచి ఉదయం ఆరు గంటలతో చింతపండుకు తీసుకుని రైతుల రాక ఆరంభమైంది. అసలే వేసవికాలం ఆరం భం కావడంతో ఎండలు మండుతున్న తరుణంలో మైదాన ప్రాంత వ్యాపారులు సైతం అదే సమయానికి సంతకు చేరుకున్నారు. ఇలా వచ్చిన చింతపండును పోటీపోటీగా కొనుగోలు చేశారు. గత వారం కిలో రూ.50నుంచి రూ.55 పలికిన చింత పండు, ఈ వారం రూ.55 నుంచి రూ.60 వరకు పలకడం విశేషం. అయినప్పటికీ ఎవరూ వెనక్కి తగ్గలేదు. సంతకు భారీస్థాయిలో చింతపండు వచ్చినప్పటికీ ఉదయం పదిగంటలకే అమ్ముడుకు కావడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


విద్యార్థుల సదస్సులో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

లక్ష్య సాధనకు పట్టుదలతో కృషిచేయండి

» విద్యార్థుల సదస్సులో ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉన్నతమైన లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. పదో తరగతి పరీక్షలు ముగిసిన సందర్భంగా టెన్త్‌లో పదికి పది పాయింట్‌లు సాధించాలని ప్రత్యేక బోధన పొందిన విద్యార్థులతో గురువారం గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పీవో మాట్లాడారు. వచ్చే నెల 7వ తేదీన కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. దానిలో మంచి ర్యాంకులు సాధించి విశాఖపట్నం, పార్వతీపురం కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ప్రవేశం పొందాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకుంటే తల్లిదండ్రులకు, పుట్టిన ప్రాంతాలకు మంచి పేరొస్తుందన్నారు. అమ్మానాన్నలకు, ఉపాధ్యాయులకు గౌరవం పెరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతం మారాలంటే విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పురావాలని సూచించారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలకు పాడేరు విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అవార్డులు, నగదు బహుమతులతో ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదువుకుని సివిల్స్ గ్రూప్-1 అధికారులుగా ఎదగాలన్నారు. గత ఏడాది అందించిన సివిల్స్ ఉచిత కోచింగ్‌తో ముంచంగిపుట్టు మండలం కిలగాడకు చెందిన గిరిజన యువతి డీఎస్పీ కాగా, మరొకరు గ్రూప్-1 ఉద్యోగాలను సాధించారని ఆయన గుర్తు చేశారు. ఆదే స్ఫూర్తితో ఈఏడాది సివిల్స్ ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యా శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని, ప్రధానోపాధ్యాయులు సింహాచలం, గంగాభవాని, మంజుల, రీమలి జాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సును వినియోగించుకోండి

» ప్రథమశ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ప్రదీప


సదస్సులో మాట్లాడుతున్న ప్రథమ శ్రేణి జుడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ ప్రదీప

పాడేరు రూరల్, మార్చి 28: అల్లూరి జిల్లాలో న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న న్యాయ సేవ విజ్ఞాన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ కోర్టు మెజిస్ట్రేట్ పి.ప్రదీప సూచించారు. జిల్లా కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు ఆమె మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో కుల, ఆదాయ, స్థిర నివాస ధ్రువీకరణ పత్రాలపై న్యాయపరమైన సమస్యలను చర్చించుకొని పరిష్కరించే విధంగా కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. జీవోలు, చట్టాలకు అనుగుణంగా కుల, ఆదాయ, స్థిర నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాల్సి ఉంటుందన్నారు. సందేహాలు ఉంటే అపీల్ చేసుకోవచ్చని, వాటి పరిష్కారానికి రెవెన్యూ శాఖ ద్వారా కృషి చేస్తామని చెప్పారు. చట్టాలను ఉల్లంఘించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొందితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, తహసీల్దార్ కల్యాణ్‌చక్రవర్తి, లీగల్ అడ్వయిజర్ ప్రసాద్‌నాయుడు, పాడేరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్‌లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

గిరిజన సంపద కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే నేతలను నిలదీయాలి


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

చింతపల్లి, మార్చి 28: గిరిజన సంపద కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే నాయకులు ఓట్లు అడిగేందుకు వస్తే నిలదీయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స పిలుపునిచ్చారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఏజెన్సీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ మైనింగ్ జరుగుతున్నదన్నారు. గిరిజనులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ఆదివాసీ గ్రామాలను ముంపునకు గురిచేసే యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం కేబినెట్ తీర్మానం చేసి షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి కట్టబెట్టిందని ఆయన ఆరోపించారు. జీవో నంబరు-3 రద్దు చేయడం వల్ల ఆదివాసీ యువతీ, యువకులు తీవ్ర నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబరు-3 పునరుద్ధరణకు వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. గిరిజన ప్రాంత సంపదను దోచుకునేందుకు, 2024 ఎన్నికల్లో మరోసారి గెలుపొందేందుకు వైసీపీ నాయకులు ఎత్తుకు పైఎత్తు వేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంత హక్కులు, చట్టాలకు రక్షణ కలగాలంటే సీపీఎం అధికారంలోకి రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో గిరిజన ప్రజలు సీపీఎం అభ్యర్థులకు అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి పడాల్, అంపురంగి బుజ్జిబాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విజేతలకు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, మార్చి 28: యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ కోరాబు అనుషదేవి చెప్పారు. చింతపల్లి ప్రీమియర్ లీగ్ ఇంటర్నల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం ఆమె బహుమతులను అందజేశారు. వారం రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో 40 క్రీడా జట్లు తలపడ్డాయి. ప్రకాశ్ బృందం ప్రథమ స్థానం, చిరు క్రీడా బృందం ద్వితీయ స్థానం సాధించాయి. ప్రథమ స్థానం సాధించిన క్రీడాబృందానికి టీడీపీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు రూ.12 వేలు నగదు, ద్వితీయ స్థానం సాధించిన బృందానికి ఎంపీపీ రూ.5 వేల నగదు బహుతులను అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణిస్తే ఉన్నత లక్ష్యాలను సులభంగా సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, ఎంపీటీసీ సభ్యురాలు దారలక్ష్మి పద్మ, నిర్వాహకులు దూనబోయిన రమణ, వీరేంద్ర, భూషణం, మధు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

వై.రామవరం, మార్చి 28: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పి.యర్రగొండ పాఠశాల హెచ్‌ఎం శ్రీపాదరామకృష్ణ తెలిపారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోవడం కుదరదని, ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివిన గిరిజన బాలబాలికలంతా ఈ ప్రవేశ పరీక్షకు అర్హులేనని తెలిపారు. పిల్లల ఆధార్, తల్లిపేరు, విద్యార్థి ఫొటో, సంతకం, కుల ధ్రువీకరణ పత్రం, ఫోన్ నెంబర్, గతంలో చదివిన పాఠశాల పేరు, చిరునామా వివరాలు అందజేయాలని సూచించారు.

వంతెన నిర్మాణం.. శిలాఫలకానికే పరిమితం!

వంతెన కోసం తొమ్మిదేళ్ల నిరీక్షణ ఫలించిందని గిరిజనులు ఆనందపడిపోయారు. సాక్షాత్తు ఎమ్మెల్యే వచ్చి శంకుస్థాపన చేయడంతో ఇక రవాణా కష్టాలు తీరినట్టేనని సంబరాలు చేసుకున్నారు. ఇది జరిగి మూడేళ్లు పూర్తయినా కనీసం పునాది కూడా పడకపోయేసరికి నీరసించి పోయారు. ఇప్పుడు అది శిలాఫలకానికే పరిమితమైందని తీరిగ్గా గ్రహించి ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదీ పోతంగి పంచాయతీలోని చంపాపట్టి వంతెన నిర్మాణ దుస్థితి.

పునాది పడని చంపాపట్టి వంతెన
శిథిలమై 12 ఏళ్లు.. శంకుస్థాపన చేసి మూడేళ్లు!
శిలాఫలకాన్ని ఆవిష్కరించి వదిలేసిన ఎమ్మెల్యే
గిరిజనులకు తప్పని రవాణా కష్టాలు
కన్నెత్తి చూడని అధికారులు, పాలకులు


హుద్‌హుద్ తుఫాన్ ధాటికి కొట్టుకుపోయిన చంపాపట్టి కాజ్‌వే



మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ ఆవిష్కరించిన శిలాఫలకం ఇదే...

డుంబ్రిగుడ, మార్చి 28: మండలంలోని పోతంగి పంచాయతీ పరిధిలోని చంపాపట్టి కాజ్‌వే హుద్‌హుద్ తుఫాన్ ప్రభావంతో కొట్టుకుపోయింది. దీంతో గిరిజనులకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. అప్పటి నుంచి వంతెన నిర్మాణం చేపట్టాలని అధికారులు, పాలకులకు వేడుకుంటున్నారు. అయినా ఎవరిలోనూ చలనం లేకపోయింది. ఇలా వంతెన కోసం తొమ్మిదేళ్లుగా గిరిజనులు ఎదురుచూడగా, 2021 మార్చి 1న ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ రూ.3 కోట్లతో అట్టహాసంగా వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఇది జరిగి మూడేళ్లు పూర్తయినా వంతెన నిర్మాణ పనులకు కనీసం పునాది కూడా పడలేదు. వంతెన నిర్మాణం పూర్తయితే కష్టాలు తీరుతాయని ఎదురుచూసిన గిరిజనులకు నిరాశ మిగిలింది. శిలాఫలకాన్ని ఆవిష్కరించాక ఎమ్మెల్యే ఫాల్గుణ మరచిపోవడం.. మూడేళ్లవుతున్నా అధికారులూ పట్టించుకోకపోవడం వెరసి ఈ వంతెన నిర్మాణం పడకేసింది. ఫలితంగా వర్షకాలంలో గెడ్డ ఉప్పొంగితే కష్టాలు తప్పడం లేదు. రోగులను తరలించడానికి గెడ్డ దాటుకుంటూ ఆసుపత్రులకు తరలించాల్సిన దుస్థితి దాపురిస్తోంది. దీంతో ప్రభుత్వ వైఖరిపై గిరిజనులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు అడిగేందుకు తమ నాయకులు ఎలా వస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

» జిల్లా కలెక్టర్ విజయసునీత » స్ట్రాంగ్ రూముల పరిశీలన



చొంపి పోలింగ్ కేంద్రంలో సదుపాయాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ విజయసునీత... స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న కలెక్టర్

అరకులోయ, మార్చి 28: జిల్లాలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి, అక్కడ స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అలాగే చొంపి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలకు సంబంధించిన స్ట్రాంగ్‌రూము, ఎన్నికల మెటీరియల్‌ను తహసీల్దార్ కార్యాలయం నుంచే ఎన్నికల ముందురోజు సిబ్బంది తీసుకు వెళ్లాలని చెప్పారు. గత ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపడుతున్నట్టు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా చూడాలని చెప్పారు. అలాగే ఈవీఎం మిషన్లు, పోలింగ్ కేంద్రంలో పోలింగ్ జరిపేందుకు వీలుగా ఇచ్చే మెటీరియల్ పక్కాగా సరఫరా చేసే విధంగా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు. ఆలాగే పోలింగ్ మెటీరియల్, ఈవీఎం మిషన్లను బస్సులో తరలివెళ్లేందుకు వీలుగా బస్సులు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. సుదూర ప్రాంతాల్లో పోలింగ్‌బూత్‌లు ఉన్న ముంచంగిపుట్టు, అనంతగిరి వంటి మండలాలకు మొదటి ప్రాధాన్యతనిచ్చి, వారిని ముందుగానే పోలింగ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో సజావుగా, ప్రశాంతంగా పోలింగ్ జరిపేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మండలాల వారీగా ఏయే రూట్లలో పోలింగ్ మెటీరియల్, ఈవీఎంలు అందజేస్తున్నది కలెక్టర్‌కు ఆర్వో అభిషేక్ వివరించారు. అనంతరం కొత్తభల్లుగుడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. చక్కగా లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం వేణుగోపాల్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో వెంకటేష్, ఏఈఈ అభిశేక్, ఎంఈవో మోహన్‌రావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో అరకు కాఫీ హౌస్

» రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తాం: డీఎం దేవరాజు

చింతపల్లి, మార్చి 28: ప్రాంతీయ ప్రజలకు అరకు కాఫీ రుచులు అందుబాటులోకి రానున్నాయి. మండల కేంద్రంలో గిరిజన సహకార సంస్థ రూ.2 లక్షలతో కాఫీ హౌస్ నిర్మాణ పనులు ప్రారంభించింది. రెండు నెలల్లో కాఫీ ప్రియులకు అరకు ఇన్‌స్టంట్ కాఫీ అందుబాటులోకి తీసుకొస్తామని జీసీసీ అధికారులు చెబుతున్నారు.

పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కాఫీ ఉత్పత్తుల్లో చింతపల్లి, జీకే వీధి మండలాలు అగ్రస్థానంలో ఉన్నప్పటికీ అరకు బ్రాండింగ్‌పైనే నేటి వరకు కాఫీ గింజలను మార్కెటింగ్ చేస్తున్నారు. గిరిజన ప్రాంత ప్రజలు కాఫీ ఉత్పత్తి చేపడుతున్నప్పటికీ కాఫీ రుచులు ఆస్వాదించే అవకాశం లేదు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడా కాఫీ హౌస్‌లు లేవు. గిరిజన సహకార సంస్థ అధికారులు ప్రముఖ పర్యాటక ప్రాంతమైన లంబసింగి, చెరువులవేనం ప్రాంతాల్లో కాఫీ హౌస్‌లు ఏర్పాటు చేయాలని సర్వే చేశారు. లంబసింగి పరిసర పర్యాటక ప్రాంతాలకు కేవలం సీజన్(నవంబరు నుంచి జనవరి) వరకు మాత్రమే పర్యాటకులు వస్తున్నారని, ఇతర సమయాల్లో సందర్శకులు రావడంలేదని జీసీసీ అధికారులు గుర్తించారు. ఈమేరకు లంబసింగి, చెరువులవేనం ప్రాంతాల్లో రానున్న సీజన్ నాటికి తాత్కాలిక కాఫీ హౌస్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. చింతపల్లి మండల కేంద్రంలో శాశ్వత కాఫీ హౌస్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. జీసీసీ పెట్రోల్ బంక్‌కి సమీపంలోనున్న జీసీసీ ఖాళీ స్థలంలో కాఫీ హౌస్ కోసం నిర్మాణాలు చేపడుతున్నారు.

జీసీసీ ఉత్పత్తుల స్టాల్..

కాఫీతో పాటు హౌస్‌లో గిరిజన సహకార సంస్థ ఉత్పత్తుల విక్రయానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అరకు ఇన్‌స్టంట్ కాఫీతోపాటు కాఫీ పొడి, తేనె, రాగి పిండి, షికాయ, కుంకుడుకాయ షాంపూలు, పొడి, పసుపు పొడి, త్రిఫల, సబ్బులు తదితర ఉత్పత్తులు చేపడుతున్నది. ప్రధాన కేంద్రాలు, ఆన్‌లైన్ ద్వారా జీసీసీ ఉత్పత్తులను అధికారులు విక్రయిస్తున్నారు.

ఈ విషయమై జీసీసీ డీఎం పి.రామరాజు కాఫీ హౌస్‌తో పాటు సబ్ డివిజన్ పరిధిలో సూపర్ బజార్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సూపర్ బజార్‌ల ద్వారా మార్కెట్ ధర(ఎంఆర్‌పీ) కంటే రూ.10-20 తక్కువ ధరకు గృహ అవసరాల ఉత్పత్తులు విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే నూనెను జీసీసీ డిపోల ద్వారా తక్కువ ధరకు విక్రయిస్తున్నాం.

పాడేరు ఎమ్మెల్యే టిక్కెట్ గిడ్డి ఈశ్వరికి కేటాయించాలి

» టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

చింతపల్లి, మార్చి 28: పాడేరు ఎమ్మెల్యే టిక్కెట్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి కేటాయించాలని పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఈశ్వరి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారన్నారు. ఆమెకు అన్ని వర్గాల ప్రజలు మద్దతిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈశ్వరికి టిక్కెట్ కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రీమల ఆనందరావు, నాగభూషణం, ఆంధ్రాబు లక్ష్మణ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

జి.మాడుగుల, మార్చి 28: మండలంలోని ఉరుము కూడలిలో 20 లీటర్ల నాటుసారాతో ఒకరికి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా అన్నవరం వైపు నుంచి మండల కేంద్రానికి సారాతో వస్తున్న జి.మాడుగుల పంచాయతీ గాంధీనగర్ కాలనీకి చెందిన జనుగురు పూర్ణరావు పట్టుబడినట్టు చెప్పారు. నాటుసారా క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు


పెంటంపాడలో బోల్తాపడ్డ లారీ

చింతపల్లి, మార్చి 28: ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పి మిల్లర్ లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే... గురువారం ఉదయం జాతీయ రహదారి నిర్మాణాలకు ఉపయోగిస్తున్న మిల్లర్ లారీ పెంటపాడు నుంచి చింతపల్లి వైపు వెళుతున్నది. అదే సమయంలో చింతపల్లి నుంచి రింతాడ వైపు సర్వీసు ఆటో ప్రయాణికులు లేకుండా ప్రయాణిస్తున్నది. పెంటపాడు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో మిల్లర్ లారీ రహదారి దిగువకు బోల్తా పడింది. ఆటో సైతం రహదారి కిందకు వెళ్లిపోయింది. దీంతో ఆటో డ్రైవర్ గాయాలతో బయటపడ్డాడు. జార్ఖండ్‌కి చెందిన మిల్లర్ లారీ డ్రైవర్ అజిత్ కుమార్ తీవ్రంగా గాయపడడంతో ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కేజీహెచ్‌కు తరలించారు.

ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ

మోతుగూడెం, మార్చి 28: మోతుగూడెం పరిధిలోని ఇంతులూరువాగు గ్రామంలో గురువారం రాధాకృష్ణ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వంతుల సుణామణి, మాతాజీ దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కుమార్‌స్వామి శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఒడిశా నుంచి రాధాకృష్ణుని భక్తులు ఇక్కడకు వచ్చి మూడు రోజులు పాటు కృష్ణ నామాన్ని జపించారు. భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

ఏజెన్సీలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి: ఐటీడీఏ పీవో

రంపచోడవరం, మార్చి 28: ఏజెన్సీ గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలోని ఆయన చాంబరులో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో హ్యాండ్ బోర్లు మరమ్మతులకు లోనైతే వెంటనే రిపేరు చేయించాలన్నారు. హ్యాండ్ బోర్ల రిపేరుపై మండలాల వారీగా సమీక్షించారు. గ్రామాల్లో తాగునీటి సదుపాయం ఏర్పాటుకు కార్యాచరణ ప్రకారం పనిచేయాలన్నారు. కాలువలు, చెలమల నీటిని వినియోగిస్తున్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, డీఈఈలు రాజేంద్రబాబు, శివ, ఎస్‌వో మార్తమ్మ, ఏడు మండలాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

తాడి.. కాలుష్యంతో తల్లడిల్లి..

... 3వ పేజీ తరువాయి

తరలించేందుకు 2019 ఫిబ్రవరిలో జీవో నంబరు 28ను విడుదల చేసింది. ఫార్మా కాలుష్యం నుంచి తాడి పంచాయతీ పరిధి గ్రామాలను తరలించేందుకు రూ. 59 కోట్లు విడుదల చేసింది. దీని కోసం ప్రత్యామ్నాయంగా పెదముషిడివాడలో లేఅవుట్ అభివృద్ధి చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ గ్రామాన్ని తరలించేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది.

హామీ ఇచ్చి మరిచిన సీఎం జగన్

తాడి గ్రామాన్ని తరలిస్తామని 2022 ఏప్రిల్ 28న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలోని ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హామీ ఇచ్చారు. అయితే రెండేళ్లు అవుతున్నా గ్రామం తరలింపునకు ఎటువంటి చర్యలు చేపట్ట లేదు. సీఎం ఇచ్చిన హామీ నెరవేరకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. కాగా కాలుష్యం నుంచి తమకు ఉపశమనం కల్పిస్తామన్న హామీని వైసీపీ పాలకులు నెరవేర్చనందుకు నిరసనగా ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్టు తాడి గ్రామస్థులు బుధవారం ప్రకటించారు. ఈ మేరకు గ్రామస్థులంతా కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు.

మిరియాల నర్సరీల అభివృద్ధికి ఇదే అదును

... 3వ పేజీ తరువాయి

పెరిగిన కలుపును తొలగించుకోవాలి. అలాగే ఆకుమచ్చ తెగులు, మొదలు కుళ్లు తెగులు నియంత్రించుకునేందుకు బోర్డో మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి. అలాగే ట్రైకోడెర్మవిరిడి కలిపిన పశువుల గెత్తం మిశ్రమం మొక్కలకు 2- 3 కిలోలు పెట్టుకోవాలి.

బోర్డు మిశ్రమం తయారీ విధానం

మిరియాల మొక్కలకు ఒక శాతం బోర్డు మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి. కిలో మైలుతుత్తం(కాపర్ సల్ఫేట్) ఐదులీటర్ల నీటిలోనూ, ఒక కిలో వ్యవసాయ సున్నం మరో ఐదు లీటర్ల నీటిలో కలుపుకోవాలి. సున్నం, మైలుతుత్తం మిశ్రమాలను 90 లీటర్ల నీటిలో కలుపుకుని మిరియాల మొక్కలపై పిచికారీ చేసుకోవాలి. అలాగే మొక్కల మొదళ్లలోనూ పోసుకోవాలి. ఎకరాకు 100 లీటర్ల బోర్డు మిశ్రమం అవసరమవుతుంది.

ఎరువు తయారీ

ట్రైకోడెర్మా విరిడి, వేపపిండి, పశువుల గెత్తం కలుపుకుని ఎరువును తయారుచేసుకోవాలి. 100 కిలోల పశువుల గెత్తం, పది కిలోల వేపపిండి, ఒక కిలో ట్రైకోడెర్మావిరిడి కలుపుకున్న మిశ్రమానికి నీరు చిలకరించుకోవాలి. పది రోజులపాటు మిశ్రమాన్ని నీడలో పెట్టుకుని చిలకరిస్తుండాలి. ఇలా తయారుచేసుకున్న ఎరువును చిరుజల్లులు పడిన సమయంలో మొక్కల మొదళ్లలో వేసుకోవాలి.


రెండు కణుపులు కలిగిన చిన్న ముక్కలను కత్తిరిస్తున్న శాస్త్రవేత్త